మృతుల బంధువులను పరామర్శించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-పీఎం పాలెం : ఏప్రిల్ 30వ తేదిన చందనోత్సవంలో సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని సిపిఐ, ఏఐటీయూసీ బృందం సోమవారం పరామర్శించింది. మధురవాడ చంద్రంపాలెంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పిళ్ళా ఉమామహేశ్వరరావు, శైలజ దంపతులు మృతి చెందడంతో ఆకుటుంబానికి తీరని నష్టం జరిగిందని బృందం సభ్యులు ఆవేదన వ్యక్తం చేసి కుటుంబానికి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, ఎస్ కె రెహమాన్, ఎం మన్మధరావు, వి సత్యనారాయణ, ఎం డి బేగం, పి వి అప్పారావు, ఎం బంగారయ్య, సీహెచ్ కాసుబాబు తదితరులు ఉన్నారు.

బర్దన్ నగర్ పేదల ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర-విశాఖ : జి.వి.ఎం.సి. 97 వార్డు పరిధిలోని సుజాతనగర్ శివారు ప్రాంతం, టీచర్స్ లే అవుట్ పక్కన సర్వే నెంబర్లు 184/5, 185, 186/3 ప్రభుత్వం స్థలం (గయాలు)లో 'బర్దన్ నగర్'లో నివసిస్తున్న దళితులు, పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన 150 కుటుంబాలకు జీవో 30 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు సోమవారం కలెక్టరాఫీసులో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ మియాపూర్ ఆశోక్‌ని విజ్ఞప్తి చేశారు. 2016 నుంచి వారంతా అక్కడ తాటాకు ఇళ్ళు, రేకులు షెడ్డులు వేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. వారంతా భవన నిర్మాణ కార్మికులు, రోజు కూలీలన్నారు. జీవీఎంసీకి ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇటివల తీసుకొచ్చిన జి.ఓ.నెంబరు 30 కింద ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, ఆర్. శ్రీనివాసరావు, నాయకులు వై.రాంబాబు, ఏ.అన్నపూర్ణ, ఎస్.అరుణ, కె.రజిని, ఎం. అనురాధ, ఎ.తిరుపతి, ఎస్. అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరాచీ బేకరీ పేర్లను మార్చాలి : జన జాగరణ సమితి కన్వీనర్ వాసు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : భారతీయులను అత్యంత కిరాతకంగా చంపుతుంటే ఇక్కడ కరాచీ పేరుతో బేకరీ నడుపుతున్న సిగ్గుచేటని జన జాగరణ సమితి కన్వీనర్ వాసు అన్నారు. సోమవారం వెంకజిపాలెం పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న కరాచీ బేకరీ వద్ద కరాచీ బేకరీ పేరు తీసివేయాలని కోరుతూ ప్లా కార్డులు ప్రదర్శించి నిరసన తెలిపి అనంతరము మీడియాతో మాట్లాడారు. యావత్ దేశంలో ఉన్నటువంటి కరాచీ బేకరీ పేర్లను తొలగించి మార్పు చేయాలన్నారు. లేని పక్షములో కరాచీ బేకరీ యజమానులపై దేశద్రోహం కేసులు పెట్టాలన్నారు. పాకిస్థాన్లో ఈ తరహా వ్యాపారాలు బెనారస్ పేరుతో పెడితే పాకిస్తానీలు సహించగలరా అని ప్రశ్నించారు. రానున్న పది రోజులలో కరాచీ బేకరీల పేర్లను మార్పు చేయని పక్షంలో పెట్రోల్ పోసి తగలబెడతామని హెచ్చరించారు. వారు చేస్తున్న వ్యాపారాలకు మేము అడ్డంకి కాదని కేవలం పేరు మార్పు చేస్తే బాగుంటుందని అన్నారు.

నల్లి ధర్మారావుకు చందు సాహితీ సంస్థ అవార్డు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : చందు ట్రస్ట్ ప్రతియేటా సాహితీవేత్తలకు ఇస్తున్న ప్రతిష్టాత్మక సాహిత్యపురస్కారం 2025 సంవత్సరానికి గానూ ప్రముఖ రచయిత, కవి, సీనియర్ జర్న లిస్ట్ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలసంఘం అధ్యక్ష వర్గ సభ్యులు, శ్రీకాకులంజిల్లా అరసం అధ్యక్షులు ఐన శ్రీ నల్లి ధర్మారావుకి అందించాలని చందుట్రస్ట్ కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు చందు సాహితీ సాంస్కృతిక సంస్థ చైర్మన్ ఆచార్య కె యస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారం ప్రజావాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు, ప్రఖ్యాత కవి పద్మశ్రీ కొలకులూరి ఇనాక్, ప్రజాకవి తెలంగాణ ఎమ్ఎల్సి, గోరటి వెంకన్న, ప్రస్తుత ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సాతుపాటి ప్రసన్నశ్రీ ప్రముఖసాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావుల వంటి ఎందరో ప్రముఖులు అందుకున్నారు. ఈనెల18వ తేదీన విశాఖపట్నంలోని పౌరగ్రంథాలయంలో ఉదయం పదిగంటలకు జరిగే ఆచార్య చందుసుబ్బారావు లిటరరీ & కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవసభలో నల్లిధర్మారావుకి ఈపుస్కారాన్ని అందజేస్తున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం.ఈ సందర్భంగా సన్మానం చేసి పదివేల రూపాయిలు, జ్ఞాపిక అతిథుల చేతులమీదుగా అందజేస్తామని తెలిపారు. ఈసభకు నగరంలోని సాహితీవేత్తలనూ, కళాకారులనూ సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు.

చీమలాపల్లి కన్వెన్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తాం

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో వీఎంఆర్డీఏ నిధులు సుమారుగా 6.24 కోట్ల రూపాయలతో అన్ని హంగులుతో ముస్తాబవుతున్న కన్వెన్షన్ సెంటర్ పనులను సోమవారం అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వెన్షన్ సెంటర్‌ను అతి త్వరలోనే ప్రజలకవ అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు, మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఆయిల్ సీడ్స్ చైర్మన్, టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి,పెందుర్తి బిజెపి నాయకులు, స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ అధికారులు అడిషనల్ కమిషనర్ రమేష్,ఇఇ ఎన్.సుధీర్,డిఇ శిరీషా, ఎఇ సింధుజా, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు నివేదిక అందజేసిన త్రిసభ్య కమిటి

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిజరూప దర్శనం (చందనోత్సం) రోజు జరిగిన ఘటనపై త్రిసభ్య కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ప్రాథమిక నివేదికను కమిషన్ ఛైర్మన్ సురేశ్ కుమార్ సీఎం చంద్రబాబుకు అందించారు. తాత్కాలికంగా కట్టిన గోడకు పునాది కూడా లేక పోవటం వలన, భారీ వర్షం వల్ల పెద్ద ఎత్తున నీరు, బురద చేరి గోడ కూలింది. గోడ దిగువకు నీరు వెళ్లేందుకు వీప్ హెరాల్స్ కూడా లేవు. చందనోత్సవానికి వారం ముందు హడావిడిగా గోడ నిర్మించారు. ప్రసాద్ పథకంలో భాగంగా గోడకు అనుమతి ఇచ్చారు. పునాది లేకుండానే గోడను కట్టేశారు. గోడ సామర్థ్యం, భక్తుల భద్రత గురించి తనిఖీలు చేయలేదు. విశాఖ సీపీ, సాక్షుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేశామని, దుర్ఘటనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఇంజినీరింగ్ సిబ్బంది, పర్యాటకశాఖ అధికారులు, గుత్తేదారులే బాధ్యులు అంటూ, వారిపై తీవ్ర చర్యలు తీసుకోవాలి అని కమిషన్ తమ నివేదకలో పేర్కొంది. సింహాద్రి పై గత నెల 30న అప్పన్న స్వామి నిజరూప దర్శనం కోసం వేచిచూస్తున్న భక్తులపై గోడ కూలడంతా ఏడుగురు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే.

క్రీడాకారులకు ప్రోత్సాహమే ధ్యేయంగా క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విశాఖపట్నం : క్రీడలకు విశాఖ నగరం ఎంతో అనుకూలమైనదని, క్రీడల అభివృద్ధికి జీవీఎంసీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, క్రీడాకారులకు, క్రీడలకు తన సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తానని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం పెందుర్తి లోని మేయర్ స్వగృహంలో విశాఖ నగరానికి చెందిన 13 సంవత్సరాల అంతర్జాతీయ క్రీడాకారిణి శ్రీసాహితి రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించినందుకు మేయర్ ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరం క్రీడలకు ఎంతో అనుకూలమైనదని ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో వారి ప్రతిభను చాటుకున్నారని అలాగే శ్రీసాహితి రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. ఇంత ఘనత సాధించి ప్రతిభ కనబరిచిన శ్రీసాహితి కు తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని, జీవీఎంసీ తరఫున సహాయ సహకారాలు క్రీడలకు అందిస్తానని,విద్యార్థులు నగరంలో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించి విశాఖ నగర కీర్తిని మరింత పెంచి నగరానికి ఘనతను సాధించి మంచి పేరు ప్రతిష్టలను తేవాలని తెలిపారు.

చెట్టు కూలి మహిళ మృతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖపట్నం ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన సంఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్కూటీపై వెళ్తున్న మహిళపై చెట్టు పడి మృతి సీతమ్మధారలోని ఏఎంజీ హాస్పటిల్ ఎదురుగుగా ఉన్న ప్రధాన రహదారిలో స్కూటీపై వెళ్తున్న మహిళపై చెట్టు కూలి ఆమె అక్కడిక్కడే మృతిచెందింది. ఘటనా స్థలానికి ఎంవీపీ పోలీసులు చేరుకుని విచారణ మొదలుపెట్టారు. ఈఘటనలో కారు, ట్రాక్టర్ పాక్షికంగా దెబ్బతిన్నాయి. మృతిచెందిన మహిళ పూర్ణి 40 సంవత్సరాలుగా, స్థానికులు పోలీసులు గుర్తించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసిందని పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పరిస్థితిని సమీక్షించారు. రెస్క్యూ టీంతో హుటాహుటిన చెట్టును కట్ చేసి రహదారి రాకపోకలకు అంతరాయం లేకుండా ఏర్పాటు చేశారు.

406 ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు ఆమోదం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా కు సంబంధించి కలెక్టర్, చైర్మన్ వారి ఆధ్వర్యంలో 406 యూనిట్స్‌కు ఎస్.సి కార్పొరేషన్ లోన్స్ పరిశీలించి ఆమోదించారు. మే 10 తరువాత ఎంపిడిఓ/జోనల్ ఆఫీస్ నుండి ఎవరైనా అర్హతల మేరకు ఎంపిక అవుతారో వారికి మాత్రమే లోన్స్ ఇవ్వమని స్పెషల్ డిసిసి ప్రత్యేక సమావేశం పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎం. సత్య పద్మ, ఎల్ డిఎం శ్రీనివాస్, బ్యాంకు కంట్రోలర్స్ హాజరయ్యారు.

జస్టిస్ ప్రియదర్శిని మృతి విశాఖకు తీరనిలోటు

ఆచార్య కె యస్.చలం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : తెలంగాణ హై కోర్ట్ జడ్జి జస్టిస్ మాటూరి ప్రియదర్శిని మరణం నన్ను బాగా కలచివేసిందని, ఆమె విద్యార్థి దశనుండే తెలుసని, చాలా చురుకైన తెలివైన వ్యక్తిత్వం అని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ చైర్మన్ ఆచార్య కేఎస్ఎల్ ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్ట్ జడ్జి అయిన సందర్భంలో విశాఖలో సన్మానసభ ఇప్పటికీ గుర్తుంద న్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఆమె అకాల మరణం విశాఖకు ఒక తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ఏఐటిఈతో ఒప్పందం

ఎస్ఎస్ఆర్ఐటిలో పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ

విశాలాంధ్ర-అనందపురం : విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం కోసం ఏఐటిఈతో ఒప్పందం చేసుకున్నామని ఎస్ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సొంట్యాం నదింపల్లి సత్యనారాయణ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏఐటిఈ ఎడుస్కిల్స్ మధ్య జ్ఞాపకోపాధి ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకి జ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించడానికి తోడ్పాటు అందించబడుతుందన్నారు. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు తగ్గట్లు సిద్ధం చేయడం వారిలో ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించగల అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వర్క్‌షాపులు, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్ కోర్సులు వంటి పలు అవకాశాలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. పరిశ్రమ-విద్యా రంగ భాగస్వామ్యాలను బలోపేతం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి ఎస్ఎస్ఆర్ఐటి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఎస్. శంభు ప్రసాద్, సీఎమ్ఓ డా.పి.ఎస్.రాజు, సెక్రటరీ డా. ఎస్. ప్రసాదరాజు, అలాగే ఏఐటిఈ ఎడుస్కిల్స్ సీఈవో పాల్గొన్నారు.

నేడు సంబంధించి పాండ్రంగి బ్రిడ్జికి శంకుస్థాపన

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం స్థానిక తహసిల్దార్‌కి ఆనందరావు తెలిపిన వివరాలమేరకు మండలంలోని కృష్ణాపురం పంచాయతీలో ఎమ్ఇఎంఇ పారిశ్రామిక అభివృద్ధి కొరకు ఏపీఐఐసీవారు పద్మనాభం మండలంలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నారని తెలియజేశారు. కృష్ణాపురం పంచాయతీ సర్వేనెంబర్ 93లో సుమారు 52 ఎకరాలు భూమిని 12 కోట్ల నలభై లక్షలు రూపాయల వ్యయంతో అభివృద్ధి పరచనున్నట్లు తెలియజేశారు. దీనికొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలియజేశారు. పాండ్రంగి బ్రిడ్జికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా శంకుస్థాపన జరుగునుంది. ఎన్నాళ్ళ నుంచో బ్రిడ్జి కలగా ఉండిపోవడం, కనీసం ఇప్పటికైనా పూర్తవుతుందో లేదో అని స్థానిక గ్రామస్తులు ఒకపక్క, శంకుస్థాపన జరుగుతుందనే ఆనందం మరోపక్క ఎప్పటిలాగే శంకుస్థాపన చేయడం పనులు ప్రారంభించకపోవడం జరుగుతుందేమో అని నిరాశ స్థానిక గ్రామస్తుల్లో కనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఈ బ్రిడ్జ్ పూర్తయినట్లైతే సుమారు చుట్టుపక్కల 30 గ్రాముల ప్రజలకు రాకపోకలకు సులభతరం అవుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ కమీషనర్‌ను నియమించాలి

ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జీవీఎంసీ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ లేఖ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : చాలాకాలంగా ఖాళీగా ఉన్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ పదవిని త్వరగా నియమించాలని కోరుతు సోమవారం జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు లేఖ రాశారు. జీవీఎంసీ కమిషనర్ పదవి నుండి సంపత్ కుమార్ ను బదిలీ చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ కు పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ జీవీఎంసీ కమిషనర్ పదవి గత 100 రోజులుగా ఖాళీగా ఉంచారన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద కార్పొరేషన్ అని, కార్యనిర్వాహక అధికారిగా కమిషనర్ జీవీఎంసీ వివిధ విధులకు హాజరు కావాలి మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం చట్టబద్ధమైన, చట్టబద్ధం కాని బహుళ విధులను నిర్వహించాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు. రోజువారీ పరిపాలనను నిర్వహించడం, రోజువారీ పారిశుధ్యం, పౌర సౌకర్యాల పనులు, ప్రధాన ప్రాజెక్టు పనులను పర్యవేక్షించడం వంటి ప్రధాన బాధ్యతలు నిర్వహించాల్సి ఉందన్నారు. తగిన అధికారిని నియమించకుండా ఈ పదవిని చాలా కాలం పాటు ఖాళీగా ఉంచడం చాలా దురదృష్టకరం అన్నారు. నగర చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా కొత్త సంకీర్ణ ప్రభుత్వం రెగ్యులర్ కమిషనర్ నియామకం లేకుండా ఇంత పెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌ను ఎందుకు నడుపుతుందో అని నగర ప్రజలు భావిస్తున్నారని తెలియజేశారు. కార్పొరేషన్‌లో ఎన్నికైన స్థానిక సంస్థ ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకపోవడం ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులందరినీ అగౌరవపరిచినట్లుగా పరిగణించబడుతుందన్నారు. కమిషనర్ పదవిని ఎక్కువ కాలం ఖాళీగా ఉంచడం సముచితం కాదు అలాంటి చర్య ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తుందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి దయచేసి ఈ విషయాన్ని వ్యక్తిగతంగా పరిశీలించి, జివిఎంసి కమిషనర్ పదవిని వెంటనే భర్తీ చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ రోజువారీ పరిపాలన సరైన మార్గంలో జరిగేలా, కొనసాగుతున్న అన్ని సివిల్ పనులను వేగవంతం చేయడానికి, పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తి చేయడానికి తగిన వ్యక్తిని జివిఎంసి కమిషనర్‌గా నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని లేఖ ద్వారా అభ్యర్థించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో 225 విజ్ఞప్తులు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్" లో వచ్చిన అర్జీలను వెంటనే ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జి వి ఎమ్ సి అడిషనల్ కమిషనర్ వర్మ, వినతులు స్వీకరించారు.

అధికారులతో పి జి ఆర్ ఎస్ నిర్వహణపై సమీక్ష సమావేశం : జిల్లాకలెక్టర్ పిజిఆర్ఎస్ నిర్వహణ మరియు స్వర్ణాంధ్ర లక్ష సాధన, పి4 సర్వే, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ నకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. సీఎంఓ కార్యాలయం, డిప్యూటీ సీఎంఓ కార్యాలయం, ఐటీ శాఖ మాత్యులు నుంచి వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంలో జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. . పరిష్కరించిన అర్జీదారుల వద్దకు వెళ్లి వారి యొక్క ఫీడ్ బ్యాక్ ను సేకరించి మొబైల్ యాప్ ఫీడ్ బ్యాక్ కలెక్షన్ రిపోర్ట్ నందు నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం గోడపత్రికలను, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారు తేదీ 5-5-25 నుండి 31-5-2025 వరకు నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ నకు సంబంధించి గోడ పత్రికను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జి వి ఎమ్ సి అడిషనల్ కమిషనర్ వర్మ లతో కలసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 225 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 81 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 14, జీవీఎంసీ సంబంధించి 79 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 51 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

ప్రపంచానికి సమానత్వ సిద్ధాంతాన్ని అందించిన మహా మేధావి కార్ల్ మార్క్స్

సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు

బర్ధన్ నగర్‌లో ఘనంగా కార్ల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : కమ్యూనిస్టు ప్రణాళిక రూపకర్త, పెట్టుబడి గ్రంథ సృష్టికర్త, ప్రపంచానికి సమానత్వ సిద్ధాంతాన్ని అందించిన మహా మేధావి, ప్రపంచ ప్రసిద్ధి తత్వవేత్త, సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్ అని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు కొనియాడారు. సిపిఐ పార్టీ పెందుర్తి మండల ఏరియా సమితి ఆధ్వర్యంలో సుజాత నగర్ పరిధి, ఎ.బి బర్ధన్ నగర్ కాలనీ లో "కార్ల్ మార్క్స్ 207వ జయంతిని సోమవారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పైడిరాజు మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న శ్రామిక వర్గానికి ఆయన మేధస్సు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. పెట్టుబడి దారులు కార్మికుల శ్రమను, హక్కులను దోచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను కమ్యూనిస్టు పార్టీల నేతృత్వంలో ఆయన వ్రాసిన గ్రంథాల్లోని సూత్రాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నామని తెలిపారు. సృష్టి ఉన్నంతవరకు ఆయన రాసిన పెట్టుబడి గ్రంథం మూడు సంపుటికలు కార్మిక వర్గాలకు మేలు చేస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు, ఎ.అన్నపూర్ణ, అసిరి నాయుడు, సీనియర్ పార్టీ సభ్యులు వై. త్రినాథ్, రాము, రమణ, యోగి, అరుణ, ఎన్.రజినీ, దుర్గారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

తహసిల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతి

విశాలాంధ్ర-అనందపురం : మండలంలో గంభీరం పంచాయితీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ ఏఐఎం (అంబేద్కర్ ఇండియన్ మిషన్)స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సోమవారం తాసిల్దార్ శ్యాంప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయన సేవలను మరువలేనివని అన్నారు. అంబేద్కర్ దేశ అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాన్ని ప్రతి గ్రామాలలో ఏర్పాటు చేయడం ఎంతో అవసరం అన్నారు. గంభీరంలో విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు ఈ కార్యక్రమంలో దలాయి శివ, చల్లారామిరెడ్డి, బాయిన ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను సత్కరించిన జీవీఎంసీ ఏఐటియుసి కార్యవర్గం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : సోమవారం ఉదయం 11 గంటలకు సమయంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు ని, ఎం సి వి ఎంప్లాయిస్ యూనియన్ ఏ.ఐ.టీ.యూ.సీ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తూ శుభాభినందనలు తెలియజేశారు . జీవీఎంసీలో దీర్ఘకాలికంగా ఉన్న కార్మిక ఉద్యోగుల సమస్యలపై మెమోరాండం సమర్పించియున్నారు. 2022, 2023, 2024 బకాయి ఉన్న సరెండర్ లీవ్ లు, దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న ఇంక్రిమెంట్లు, కొన్ని జోనల్ కార్యాలయాలు లో మరియు ఇతర శాఖలలో ఖాళీగా ఉన్న గుమస్తాలను నియమించాలని, పబ్లిక్ హెల్త్ విభాగం మలేరియాలో సీజనల్ మ్యాన్ పవర్ కాంట్రాక్ట్ ను ఎస్ ఎల్ ఎఫ్ సంస్థలకు నామినేషన్ పద్ధతిలో అప్పగించడం హెచ్ఎంసి చట్టం-1955-56 ప్రకారం చట్ట విరుద్ధమని, గత ప్రభుత్వం రద్దు చేసినటువంటి జి.ఓ.యం.యస్.నెం.279ను సాగించడం చట్ట వ్యతిరేకమని, నామినేషన్ పద్ధతి కాకుండా టెండర్ పిలవాలని, 3వ పార్టీ ఓ అండ్ యం టెండర్ కాంట్రాక్ట్ విధానంను రద్దుచేయాలని, ఓఅండ్‌యం కాంట్రాక్టులో పనిచేస్తున్నటువంటి డ్రైవర్లకు నేరుగా జీవీఎంసీ జీతాలు చెల్లిచాలని మినిమం వేజెస్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్ణయం చేసినటువంటి జీతాలు చెల్లించాలని, ఈఎస్ఐ పిఎఫ్ వర్తింప చేయాలని, వి.యం.ఆర్.జె.జె.బి.వై ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని ఉద్యోగాల పేరుతో క్లాప్ లోడర్స్, క్లాప్ డ్రైవర్స్ మరియు సూపర్వైజర్స్ గా పనిచేస్తున్న నిరుద్యోగులు నుండి అక్రమంగా అన్యాయంగా 2 లక్షలు నుంచి 3 లక్షల రూపాయలు వరకు డబ్బులు వసూలు చేసిన కాంట్రాక్టర్ శ్రీ సాయి దుర్గ కన్సల్టెన్సీ సర్వీస్ వారిపై పోలీస్ చర్యలు తీసుకోవాలని, మలేరియా విభాగంలో సీజనల్ మ్యాన్ పవర్ టెండర్ కాంట్రాక్టుల్లో జీవీఎంసీ లో పనిచేస్తూ రిటైర్ అయిన చనిపోయిన, ఎంటిఎస్ కార్మికుల పిల్లలకు అవకాశం కల్పించాలని, టౌన్ ప్లానింగ్ విభాగంలో తొలగించిన ఎగ్జిస్టింగ్ చైన్ మాన్ లను తిరిగి పునరుద్ధరించి, కొనసాగించాలని టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్లాస్టిక్ నిర్మూలన నిమిత్తం గతంలో నియమించి, తదుపరి తొలగించిన కార్మికులను తిరిగి కొనసాగించాలని కోరుతూ, వినతి పత్రంను సమర్పించగా మేయర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బగత వెంకట్ నారాయణ, అధ్యక్షులు పడాల రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కే సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి కోలా వాణి ప్రియదర్శిని, నాయకులు లింగాల వెంకటేష్ పిట్టా కిషోర్, సారిపిల్లి కోటి కిలారి శివ, శేఖర్, కిలాని శివ తదితరులు పాల్గొన్నారు.

జనాభా లెక్కలతో పాటు కులగణాలు చేపట్టాలి : డిహెచ్‌పిఎస్

విశాలాంధ్ర-మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో జీవీఎంసీ పరిధిలో ఉన్న 63వ వార్డు కాకర్లవ జంక్షన్‌లో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు పాల్గొని మాట్లాడుతూ జనాభా లెక్కలతో పాటు కులగణాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని డిహెచ్‌పిఎస్ తరఫున స్వాగతిస్తున్నామన్నారు. దీనివల్ల బడుగు బలహీన వర్గాల తగలవారికి న్యాయం జరుగుతుందని ఆర్థికంగా లబ్ధి తో పాటు రిజర్వేషన్ పరంగా కూడా వారికి వరణ్య అవకాశాలు లభిస్తాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు ఈ.కామేశ్వరరావు, కనకరాజు, కనకేశ్వరరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాటితూరు భూ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు

విశాలాంధ్ర-తగరపువలస : విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు తాటితూరు గ్రామం రీ-సర్వే జరుగుతున్న నేపథ్యంలో అందరి రైతుల వారసత్వ భూములు ఆన్లైన్ చేసి రైతుల కుటుంబాలని ఆదుకోవాలని వినతిపత్రం అందజేసారు. ఈ విషయమై గ్రామానికి వచ్చి సమస్య పరిస్కారం కొరకు ప్రయత్నం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొమర రాము కోనాడ రమణ మేడ చిన్నారావు మద్దిల గురునాయుడు మద్దిల పాపారావు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించండి : నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లోని స్వీకరించిన అర్జీలను / ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ఇతర ఉన్నతాధికారులు మేయర్ కు స్వాగతం పలికి పుష్పగుచ్చాన్ని అందించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మేయర్ తో కలసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను నిర్వహించాలన్న ఆదేశాల మేరకు జీవీఎంసీలో ప్రతి సోమవారం అధికారులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని, ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీను/ ఫిర్యాదును క్షుణ్ణంగా అధికారులు పరిశీలించి ప్రజల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవిఎంసి ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాల్లో స్వీకరించిన అర్జీలలో ఎటువంటి అలసత్వం వహించరాదని, పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజా సమస్యల కు పరిష్కారం లభించడం లేదనే ఫిర్యాదులు ప్రజల నుండి రాకుండా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించాలని మేయర్ అధికారులకు ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమీషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 300 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 17, 3వ జోన్ కు 20, 4వ జోన్ కు 15, 5వ జోన్ కు 06, 6వ జోనుకు 09, 8వ జోన్ కు 227, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 06 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ %a% అకౌంట్సు విభాగమునకు 220, రెవెన్యూ విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 48, ఇంజినీరింగు విభాగమునకు 16, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 07 కలిపి మొత్తంగా 300 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద రాజు, చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి,డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజనీర్లు కేవిఎన్ రవి, సంపత్ కుమార్, కృష్ణారావు, గోవిందరావు, యు సి డి, పి.ఒ-డి.లక్ష్మి, డిపిఓలు ఎం.వీ.డి ఫణి రామ్, ఎల్.సురేష్, విజయశంకర్, సివిఒ డా.ఎన్.కిషోర్, బయాలజిస్ట్ సాంబమూర్తి, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, ఆర్.ఎఫ్.ఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ ఏఐ క్యుఎల్ఈడి టివి క్రిస్టల్ సిరీస్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలోని అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ అమెజాన్, ఫ్లిప్ కార్ట్ సాంసంగ్ డాట్ కామ్ లలో అందుబాటులో ఉన్న దాని కొత్త శ్రేణి ఏఐ ఆధారిత క్యుఎల్ఈడి టివి క్రిస్టల్ క్లియర్ 4కె యుహెచ్ డి టివి లను అందుబాటులో ఉంచినట్లు ప్రకటించింది. అత్యుత్తమ గృహ వినోద అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిన కొత్త శ్రేణిలో క్యుఎల్ఈడి సిరీస్ క్యూ ఈ ఎఫ్ 1, అత్యాధునిక ఏఐ సాంకేతికతతో అమర్చబడి ఉంటుంది, క్లియర్ 4కె యుహెచ్ డి టివి సిరీస్ యూ ఈ 81, యూఈ 84, యూఈ 86 ఉన్నాయి. అద్భుతమైన స్పష్టత, రంగు మరియు సూక్ష్మ అంశాలను అందించడానికి రూపొందించబడింది. ఇది అద్భుతమైన రంగు ఖచ్చితత్వం మరియు మన్నికను అందిస్తుంది. సాంసంగ్ ఈ ఆవిష్కరణలో అత్యంత కీలకంగా క్యుఎల్ఈడి టీవీ ఉంది, ఇది అద్భుతమైన రంగు ఖచ్చితత్వం, మన్నికను అందించడానికి రియల్, సేఫ్ క్వాంటం డాట్ టెక్నాలజీని కలిగి ఉంది.

అమేజాన్ ఇండియా గ్రేట్ సమ్మర్ సేల్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాబోతున్న గ్రేట్ సమ్మర్ సేల్ కోసం అమేజాన్ ఇండియా బ్లాక్ బస్టర్ డీల్స్ ను వెల్లడించింది. "అత్యంతగా అంచనా వేయబడిన ఈ సేల్‌కు శామ్ సంగ్ ఏఐ సహ మద్దతునిస్తోంది. ఈ సీజన్ లో షాపర్స్ కు ఆనందపరచడానికి ప్రముఖ బ్రాండ్లలో సాటిలేని విస్తృతమైన డీల్స్ ను తెచ్చింది. శామ్ సంగ్ ఏఐ మరియు ఇంటెల్ నుండి ప్రీమియం టెక్నాలజీలో, శామ్ సంగ్ ఉపకరణాలు & టీ వీ, టీ సీ ఎల్, హైసెన్స్ నుండి ఆధునిక హోమ్ ఎంటర్టైన్మెంట్ పరిష్కారాలు, టాటా ఉత్పత్తులు, మజిల్ బ్లేజ్, వోలిని, హెచ్ యు ఎల్, కెల్లాగ్స్, మరియు బోట్ నుండి నమ్మకమైన వినియోగదారు అభిమానించే వాటి నుండి కస్టమర్లు ప్రముఖ ఆఫర్లను అన్వేషించవచ్చు. అమేజాన్ పే షాపింగ్‌లో, టిక్కెట్లు బుక్కింగ్ చేసే సమయంలో, లేదా బిల్లులు చెల్లించడంలో తమ 1వ, 5వ, మరియు 10వ లావాదేవీలలో ప్రత్యేకమైన ఆఫర్లతో రూ. 5,000 విలువ గల బంపర్ రివార్డ్స్ ఉన్నాయి. అమేజాన్ పే ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ ను వినియోగించి ప్రైమ్ సభ్యులు రూ. 2,500 విలువ గల వెల్కం రివార్డ్స్ తో అపరిమితంగా 5 శాతం క్యాష్ బాక్ కూడా అందుబాటులో ఉంది.

10 తీవ్రమైన కేసుల్లో 7 కేసుల్లో ఉబ్బసం తక్కువగా నిర్ధారణ అయింది

భారతదేశం జాతీయ ప్రతిస్పందనను పెంచాలని కోరుతున్న నిపుణులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : "అందరికీ పీల్చే చికిత్సను అందుబాటులోకి తీసుకురావడం" అనే జినా (గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్తమా) థీమ్‌తో గుర్తించబడిన ఈ సంవత్సరం ప్రపంచ ఆస్తమా దినోత్సవం భారతదేశ ప్రజారోగ్య ప్రయాణంలో కీలకమైన సమయంలో వస్తుంది. దేశవ్యాప్తంగా జరిగే మరణాలలో సగానికి పైగా సంభవించే నాన్-కమ్యూనికేటెడ్ డిసీజ్ సంబంధిత మరణాలకు ఆస్తమా మరియు ఇతర దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు దోహదపడే మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. 4 అయినప్పటికీ, తీవ్రమైన ఆస్తమా లక్షణాలు ఉన్న దాదాపు 70 శాతం మంది వ్యక్తులు నిర్ధారణ కాలేదు మరియు 2.5 శాతం కంటే తక్కువ మంది ప్రతిరోజూ ఇన్హేల్డ్ కార్టికోస్టెరాయిడ్‌లను ఉపయోగిస్తారు, అంటే సిఫార్సు చేయబడిన చికిత్స, తరచుగా విస్తృతమైన కళంకం మరియు అపోహల కారణంగా. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి అవగాహన, విద్య మరియు ప్రాప్యతను ఏకీకృతం చేసే దీర్ఘకాలిక, సహకార విధానం అవసరం. సిప్లా యొక్క బెరోక్ జిందగీ వంటి ప్రజా ముఖ ప్రచారాలు అర్ధ దశాబ్దానికి పైగా నడుస్తున్నాయి మరియు టఫుల్స్, కంపెనీతో పాటు బ్రీత్‌ఫ్రీ ఎఫ్ వై 24-25 లోనే 1 కోట్ల మందికి పైగా జీవితాలను తాకిన ఈ చొరవ, రోగులకు నిరంతర సహాయాన్ని అందిస్తూ ఆస్తమా చుట్టూ సమాచార సంభాషణలను నడిపించడంలో సహాయపడుతోంది.

కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణా కార్యక్రమం ప్రారంభం

వన్ కేఈఎఫ్ యాప్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : కోటక్ మహీంద్రా ఆధ్వర్యంలో కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణా కార్యక్రమం ఆంధ్రప్రదేశ్లో ప్రారంభమైంది. దీంతో పాటు వన్ కేఈఎఫ్ యాప్ ఆవిష్కరించారు. ఇది కోటక్ మహీంద్రా గ్రూప్‌కి చెందిన సీఎస్ఆర్ అమలు సంస్థ కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఈఎఫ్) టీచర్ సామర్థ్యవృద్ధి కార్యక్రమమైన 'క్షమత'. ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుల కోసం వన్ కేఈఎఫ్ యాప్ను అండ్రాయిడ్ ఫోన్ల కోసం విడుదల చేసింది. క్షమత ఆంధ్రప్రదేశ్‌లోని 186 ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలు, 108 మహాత్మా జ్యోతిబా ఫులే ఆంధ్రప్రదేశ్ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలల్లో అమలులోకి వస్తోంది. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులకు మెరుగైన బోధనా సాంకేతికతలు, ఆంగ్ల భాషా నైపుణ్యాలు, అభివృద్ధి ప్రాతిపదిక ఉన్న దృక్పథం, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసేలా రూపొందించబడింది. విద్యార్థుల విద్యా ఫలితాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. జాతీయ విద్యా విధానం 2020 (ఎన్ఈపీ 2020)ను ఆధారంగా రూపొందించిన శిక్షణా మాడ్యూళ్ళు, జీవితానుభవాలపై ఆధారపడి ఉండే నేర్చుకునే విధానాలు ఈ కార్యక్రమంలో ఉన్నాయి. ఈ సందర్భంగా కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ గణేశ్ రాజా మాట్లాడుతూ వన్ కేఈఎఫ్ యాప్ విద్యా రూపాంతరం దిశగా మా ప్రయాణంలో ఒక మైలురాయి అన్నారు. ఇది కేవలం యాప్ మాత్రమే కాదని, ఇది ఒక శక్తివంతమైన వ్యవస్థ అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం ఇది రూపొందించబడిందని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత మూల్యాంకనాలు, కేంద్రీకృత విద్యా విషయ సమాహారం, పరస్పర సహకారానికి, కమ్యూనికేషన్‌కి మద్దతిచ్చే ఫీచర్లు కలిగి ఉన్న ఈ వేదిక ఉపాధ్యాయ సామర్థ్యాన్ని, వ్యూహాత్మక నిర్ణయం తీసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధానాన్ని తిరిగి నిర్వచిస్తుందని తెలిపారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకులకు అభినందనలు

విశాలాంధ్ర-మల్కాపురం : ఏప్రిల్ 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు 15 రోజుల పాటు పరిశోధనా పద్ధతులపై నిర్వహించిన అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో విజయవంతంగా పాల్గొన్న ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయా దేవిలను సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ- వీరిరువురూ ఆన్ లైన్లో రోజుకు రెండు గంటలు చొప్పున మొత్తం 30 గంటల పాటు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, పలువురి ప్రశంసలు పొందడం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని, అనసూయ ను అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.

పది ఉత్తమ విద్యార్థులను ఘనంగా సత్కరించిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు



విశాలాంధ్ర-పెందుర్తి : ప్రైవేట్ పాఠశాలలను మించి ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని, దీనికి ఉదాహరణ పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనపరచడమేనని పోలీస్ అధికారి జి. గోవిందరావు పేర్కొన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఆర్.గేస్మ, ఏ.అఖిల్, ఆళ్ల గీతిక శిఖర,ఎస్.దీక్షలను పెందుర్తి వెంకటాద్రి వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేసి వారి ప్రతిభ పాటవాలను, విద్యాభిలాషను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ అధికారి గోవిందరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధి జి.ఎస్ ప్రకాష్ రావు, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్. చిన్మయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను భుజం తట్టి ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు కంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గణనీయంగా మార్కులు సాధించి మంచి ప్రతిభ పాటవాలు ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ వరవడి సమాజానికి మంచి పరిణామం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి వాకర్స్ క్లబ్ ప్రతినిధి అన్నపూర్ణ శేఖర్, పలువురు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన వాకర్స్ క్లబ్బు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

నాయకత్వానికి భావప్రకటనా నైపుణ్యాలు అవసరం

విశాలాంధ్ర-మల్కాపురం : గొప్ప నాయకులుగా తయారవ్వాలంటే భావ ప్రకటనా నైపుణ్యాలు (కమ్యూనికేషన్ స్కిల్స్) ఎంతో అవసరం అని ప్రముఖ ఇంజనీర్ సంజీవ్ హేమంత్ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ - చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం భావ ప్రకటనా నైపుణ్యాలని, వీటిలో ప్రతిభను కలిగి ఉంటే వ్యక్తిత్వం వికసిస్తుందని ఆయన అన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ వల్ల ఇంటర్వ్యూలో విజయం సాధించవచ్చు అని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చని, స్పష్టమైన ఆలోచనలను కలిగి ఉండవచ్చని ఆయన అన్నారు. ఇతరులతో సంబంధాలు బలపడాలంటే భావ ప్రకటన నైపుణ్యాలు అవసరం అని అన్నారు. అనంతరం జాతీయ సేవా పథక వలంటీర్ జ్యోతిర్మయి అనేక ఆటలను శిబిరంలోని చిన్నారులకు నేర్పారు.

అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠా ఉత్సవాల నిర్వహణకు రవికుమార్ విరాళం అందజేత

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం పుణ్యక్షేత్రంలో కొండపై వేంచేసియున్న అనంతపద్మనాభస్వామి ఆలయ శిఖర సంప్రోక్షణ, పునఃప్రతిష్ఠా ఉత్సవాల నిర్వహణకి సోమవారం రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ తరుపున చైర్మన్ రూపాకుల రవికుమార్ ఆలయ ఈ ఓ. ఎస్.నానాజీబాబుకి 25 వేల రూపాయల చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి , స్వామివారి ఉత్సవాల నిర్వహణకి ట్రస్ట్ తరుపున అన్ని విదాల సహాయం అందించనున్నట్లు ఆయన అన్నారు. గతంలో కూడా వేలాది రూపాయలు విరాళంగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు,టీడీపీ మాజీ అధ్యక్షులు కె నగేషకుమార్, నాయకులు ఎర్రినాయుడు, సన్నిబాబు, సన్యాసిరావు, కృష్ణారావు, గౌరిరెడ్డి, మహేష్, రాము,పేర్రాజు పాల్గొన్నారు.

తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి

కలెక్టర్‌కు దళిత, ప్రజా సంఘాలు ఫిర్యాదు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : చినముషిడి వాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో స్థానికులు నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం తగదని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి ఆర్ జి ఎస్)లో సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దళిత, దళిత ప్రజాసంఘాల నేతలు, కాలనీవాసులు కలసి యధా స్థానంలో అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులే పునఃప్రతిష్టించాలని వినపత్రాన్ని అందజేశారు.కాలనీ ఉమ్మడి స్థలంగా ఉన్న 250 గజాల ప్రభుత్వ స్థలాన్ని మినీ పార్క్ గా అభివృద్ధి చేసుకోవడతో పాటు అంబేద్కర్ విగ్రహాన్ని అక్కడ ప్రతిష్టించాలని కాలనీవాసులు నిర్ణయించారని ఆయన దృష్టికి తెచ్చారు.ఇలాగా బుర్రా రాజేష్ అనే వ్యక్తి ఆ స్థలంలో 200 గజాల స్థలాన్ని కబ్జా చేసి రెండంతస్థుల నిర్మాణం చేశారని మిగిలిన 50గజాల స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అంబేద్కర్ తొలగించిన అధికారుల వైఖరి అభ్యంతరకరమని ఆయనకి తెలిపారు. తక్షణమే అక్కడ బుర్ర రాజేష్ కబ్జాలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కాలనీవాసుల ఉపయోగపడే విధంగా మినీ పార్క్ అభివృద్ధి చేయాలని కోరారు.దీనిపై స్పందించిన కలెక్టర్, ఓపెన్ స్పేస్ గా ఉంచుతామని మినీ పార్క్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి మాత్రం అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. భీమ్ సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎవరికి అడ్డు లేకుండా ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పితే దాన్ని అధికారులు తొలగించడం దుర్మార్గమని మండిపడ్డారు బుర్ర రాజేష్ అనే వ్యక్తి స్థలాన్ని ఆక్రమించారని కాలనీవాసులు చాలా కాలంగా ఫిర్యాదు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు అతనిపై తీసుకోకపోగా తూతూ మంత్రంగా వ్యవహరించాలని తెలిపారు.రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని మాత్రం తొలగించడం ఆయన్ను అవమాన పరచడమే అన్నారు. ఇదే విషయంపై గతంలో ఆర్డీవో కాలనీవాసులను పిలిపించి విగ్రహాన్ని తొలగించాలంటూ వారిపై జులుం ప్రదర్శించి అధికార దుర్వినియోగం పాల్పడే విధంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. పివో డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వంక చూపించి అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని దీనికి ఆ మార్గదర్శకాలు వర్తించవని తెలిపారు మహిళలపై దౌర్జన్యం చేయడంతో పాటు కులం పేరుతో దూషించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. బుర్రా రాజేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భీమ్సేన వార్ అధ్యక్షుడు కె చిన్నారావు, ఉపాధ్యక్షుడు దుర్గారావు, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్. వెంకటలక్ష్మి, ఎం ఎం ఎస్ ఎస్ నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, అరుణోదయ నాయకులు కె. బాలనాగమ్మ, గీత,ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ ప్రతినిధులు పసలతకుమారి, జమున, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతుడు పెద్దిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

విశాలాంధ్ర-ఆనందపురం : వెల్లంకి సర్వీస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దిపాలెం గ్రామం రామాలయం వీధికి చెందిన షీలా శ్రీను(49) రోజువారి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి కూలి పని ముగించుకుని సైకిల్ పై ఆనందపురం నుంచి పెద్దిపాలెం వస్తుండగా వెల్లంకి సర్వీస్ రోడ్డులో ఆటో బలంగా ఢీకొంది. దీంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్సులో స్థానికఎన్నారై ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందితూ శ్రీను మృతి చెందాడని వైద్యులు న తెలిపారు.మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుమార్తె షీలా.భవాని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం ఎస్ఐ పందిరి శివకు అప్పగించామని ఆనందపురం సీఐ సిహెచ్ వాసు నాయుడు తెలిపారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి సోమవారం పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

ఫుట్ బాల్ క్రీడాకారులకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-తగరపువలస : భీముని పట్నం నందు ఫుట్ బాల్ క్రీడాకారుల బాలురకు వేసవి కాలం సందర్భంగా, 05-05-2025 నుండి 05-06-2025 వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం బీమిలి ఫుట్ బాల్ గ్రౌండ్ నందు ఫుట్ బాల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలియజేసారు. 35 మంది క్రీడాకారులకు జెర్సీ లు మరియు బాల్స్, కలిగొట్ల శ్రీరామ్ ధన సహాయంతో, ఇవ్వడం జరిగింది. క్రీడా కారులకు ప్రతి రోజు గ్రుడ్లు, ఫ్రూట్స్ రేలంగి చిన బాబు ఇవ్వడం జరుగుతుంది. క్రీడా కారుల శిక్షణా ప్రధాన కోచ్ సీతారామరాజు మరియు చంద్ర శేఖర్, రాజా, అత్తిలి చినబాబు, వీరి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. కావున ఆసక్తి గల క్రీడా కారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కలిగొట్ల శ్రీరామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు గొలగాని నరేంద్ర, రేలంగి చినబాబు, అక్కర మాని చినబాబు,చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానం ఆంజనేయులునగర్ సమస్యను పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర-విశాఖ : మధురవాడ మానం ఆంజనేయులునగర్ లోని సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, మానం ఆంజనేయులు నగర్ రెసిడెంట్స్ సేవా సంఘం అధ్యక్షులు బొద్దేపల్లి సురేష్, గౌరవాధ్యక్షులు డి.ప్రతాపరాజు, ప్రధాన కార్యదర్శి పాండ్రంకి అప్పారావు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కే ఎస్ విశ్వనాథన్ లను కలిసి విజ్ఞప్తి చేశారు. కాలనీలో రోడ్లు, కాలువలను బ్లాక్ చేసి గోడ కట్టి మురుగు నీటిని బ్లాక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో ఒక వ్యక్తి సర్వే నెంబరు 126/4 స్థలం తనదంటూ వుడా లే అవుట్ ప్రకారం ఉన్న రోడ్లు, కాలువలను దౌర్జన్యంగా 5చోట్ల బ్లాక్ చేసి గోడలు కట్టారని తెలిపారు. దీని వల్ల ఎగువ నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపై వచ్చి పూర్తిగా నిల్వ ఉండిపోతోందని చెప్పారు. దీని వల్ల దోమలు వృద్ధి చెంది పిల్లలు, వృద్ధులు, ప్రజలందరూ విషజ్వరాల బారిన పడుచున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్, జి.వి.ఎం.సి ఇన్చార్జి కమీషనర్‌కి మార్చిలో ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని, దానిపై జి.వి.ఎం.సి. జోన్ 2 కమీషనర్ అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి సర్వే నెంబరు 126/4 వుడా పరిధిలో ఉందని, అందువల్ల వుడా అధికారులు సర్వే నివేదిక ఆధారంగా రోడ్లు, డ్రైనేజీలు పునరుద్ధరిస్తామని తెలిపారన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జె డి నాయుడు, సహాయ కార్యదర్శి సిహెచ్ వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో తయారు చేసిన తన స్మార్ట్‌స్పీకర్‌ను అవిష్కరించిన ఫోన్‌పే

విశాలాంధ్ర-విశాఖపట్నం : మర్చంట్ల మారుతున్న వ్యాపార అవసరాలకు తగినట్టు అప్‌గ్రేడ్ చేసిన తన సరికొత్త స్మార్ట్‌స్పీకర్‌ను ఆవిష్కరించామని ఫోన్‌పే నేడు ప్రకటించింది. ఒరిజినల్ స్మార్ట్‌స్పీకర్ పునాదులపై నిర్మించిన దీనిని భారతదేశంలోనే తయారు చేయడం గమనార్హం. తాజా అప్‌గ్రేడ్ ఇదివరకటి స్మార్ట్‌స్పీకర్‌లోని పాపులర్ ఫీచర్లను అలాగే కొనసాగిస్తూనే, ముఖ్యమైన మెరుగుదలలను కూడా ప్రవేశపెట్టింది. దీనిపై ఫోన్‌పేలోని మర్చంట్ బిజినెస్ విభాగం చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ, "భారతదేశంలో తయారైన మా సరికొత్త స్మార్ట్‌స్పీకర్లను ప్రవేశపెట్టడం మాకెంతో ఆనందంగా ఉంది. స్థానికంగా ఈ పరికరాలను తయారు చేయడం వల్ల మా మర్చంట్ల నిర్దిష్ట అవసరాలు, ప్రాధాన్యతలకు తగ్గట్టు ఉత్పత్తులను సిద్ధం చేసే సౌలభ్యతలను మాకు అందిస్తుంది. ఈ స్మార్ట్‌స్పీకర్లు, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్థిక సేవలు అంతగా లేని మారుమూల ప్రాంతాలలోని మర్చంట్లకు ఆర్థిక మేళవింపును ప్రోత్సహించడంతో పాటు దేశంలోని డిజిటల్ రూపాంతరంలో భారతీయ తయారీదారులు కూడా అంతర్గత భాగస్వాములయ్యేలా స్థానిక నవ్యావిష్కరణలను ప్రోత్సహిస్తాయి" అని అన్నారు.

ఏపిసిడబ్ల్యుసిలో ఆల్ పెన్షన్ రిటైర్డ్ పెన్షన్ సమావేశం

విశాలాంధ్ర-పెదగంట్యాడ : పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఆల్ పెన్షన్ రిటైర్డ్ పెన్షన్ సమావేశం జరిగింది. ఈ ఈ సమావేశానికి కనితి అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం ముఖ్య నాయకులు హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ గణపతి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు కార్మికులకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది (4/11/2022). మూడు సంవత్సరాలు కావస్తున్నా అయ్యర్ పెన్షన్ వాయిదాల మీద వాయిదా వేస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది. 10 సంవత్సరాలు కావస్తున్న, ఒక కార్మికుడు ఒక పబ్లిక్ సెంటర్లో సర్వీస్ 30 / 35 ఏళ్లు చేసి చాలీసాలుని పెన్షన్తో జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వం వెంటనే మినిమం పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలని భార్య భర్తలకి మెడికల్ సౌకర్యం కల్పించాలి ట్రైన్ 50% రాయితీ ఇవ్వాలి వైట్ రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయ్యర్ పెన్షన్‌కి డబ్బులు కట్టిన వాళ్ళందరూ కూడా అయ్యర్ పెన్షన్ అందజేయవలసిందిగా కోరుచున్నా ఈ. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎర్రిగుడ్డు అసోసియేషన్ నాయకులు జే అప్ప స్వామి, జిల్లా నాయకులు కె దీనబంధు,బెల్లాల నాగేశ్వరావు, నమ్మి అప్పలనాయుడు, కాకినాడ పెంటారావు, నడిపూడి వెంకట్రావు, బి గురప్ప, శేశెట్టి అప్పారావు, కాకినాడ సింహాసనం, ఎర్నీ రమణ, ద్వారపూడి గురునాథ్రా, వెంకయ్య, నక్క అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూతురు పుట్టినరోజు సందర్భంగా పేద ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం రేవిడి పంచాయితలో శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర బ్రిక్స్ అండ్ లారీ ట్రాన్స్పోర్ట్ యజమాని మజ్జి చిన్నారావు కుమార్తె ధనుశ్రీ పుట్టినరోజు సందర్భంగా స్థానిక గ్రామంలో కొంతమంది నిరుపేదలను గుర్తించి వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వారితోపాటు శ్రీనివాస్ సేవా సంఘం అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, కార్యదర్శి పద్మనాభ స్వామి, సహాయ కార్యదర్శి కంది సత్యనారాయణ, మాజీ ఉపాధ్యక్షులు మరగడ చిరంజీవి, మెంబర్స్ ఓమ్మి పైడి నాయుడు,రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొనడం జరిగినది.

ఎంఐజీ బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎంసీ విశ్వనాథన్

విశాలాంధ్ర-విశాఖ : మధ్యతరగతి కుటుంబాల సొంత ఇంటి కలలను తీర్చడానికి అన్ని సౌకర్యాలతో కూడిన ఎంఐజీ బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్‌లను నిర్మించనున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలుదారుల ప్రాధాన్యతలను తెలుసుకుని, ఇ ప్రాంతాల్లో అపార్ట్మెంట్లను నిర్మిస్తామని తెలిపారు. దీనికోసం ఆసక్తి వ్యక్తీకరణ సర్వే చేపడుతున్నామన్నారు. కొనుగోలుదారుల సూచనలు, సలహాలు మెరుగైన సౌకర్యాల కల్పనకూ దోహదపడతాయని అన్నారు. దీనికోసం క్యూఆర్ కోడ్ తో కూడిన ప్రకటన బోర్డులను అన్ని పర్యాటక ప్రాంతాల్లో, పార్కుల్లో, వాణిజ్య సముదాయాల్లో, విశాఖ నగరంలోని అన్ని ప్రముఖ సందర్శనా స్థలాల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు.